ప్రజాశక్తి
బుధవారం 24 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



వృద్ధ దంపతులకు వారియర్స్ ట్రస్ట్ చేయూత

ప్రజాశక్తి - చింతపల్లి : వృద్ధాప్యంతోపాటు అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న చంటిబాబు, పెదబుల్లి వృద్ధ దంపతులకు చేయూత వారియర్స్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఆ ట్రస్ట్ చైర్మన్ దూనబోయిన రమణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిటిసి చిందాడ జయలక్ష్మి, ట్రస్టు సభ్యులతో కలిసి స్థానిక అంబేద్కర్ కాలనీలో సరైన గృహం, సరైన ఆదరణ లేక ఇబ్బంది పడుతున్న గంటేడ చంటిబాబు, పెదబుల్లి దంపతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన చంటిబాబు కుటుంబానికి తమ ట్రస్టు తరుపున ఆర్థికంగా అండగా ఉంటామన్నారు. ఆ దంపతుల జీవనోపాధికి ప్రతినెలా రూ.1000 ఆర్థిక సహాయం చేయాలని ట్రస్ట్‌నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా జనవరి నెలకు సంబంధించి ఆ దంపతులకు రూ.1000 ఆర్థిక సహాయం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సాగిన జగన్ పంతులు, కటారీ సత్యనారాయణ, మద్దాల వివేక్, ఎం దారబాబు, పాల్గొన్నారు

అంగన్వాడీల ఆనందహేళ!

- పలుచోట్ల విజయోత్సవ ర్యాలీలు
- సాంప్రదాయ నృత్యాలతో సందడే సందడి
- సమ్మె విరమించి విధుల్లో చేరడంతో తెరుచుకున్న అంగన్వాడీ కేంద్రాలు



అరకులోయలో థింసా నృత్యాలు చేస్తున్న అంగన్వాడీలు



చింతూరులో అంగన్వాడీల విజయోత్సవ ర్యాలీ

నిరవధిక సమ్మె చేసి, నిరంకుశ ప్రభుత్వంతో పోరాడి డిమాండ్లను సాధించుకున్న అంగన్వాడీలు విజయోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల ర్యాలీలను నిర్వహించడంతోపాటు సాంప్రదాయ థింసా నృత్యాలను చేస్తూ సందడి చేశారు. 42రోజుల సుదీర్ఘ సమ్మె తర్వాత విధుల్లో చేరడంతో, అంగన్వాడీ కేంద్రాలు మళ్లీ తెరుచుకున్నాయి.
- ప్రజాశక్తి విశేషక యంత్రాంగం

ప్రజాశక్తి - అరకులోయ : తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల నిర్విరామ పోరాటంతో చారిత్రాత్మక విజయం సాధించారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు అన్నారు. అంగన్వాడీల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో సమ్మెను విరమించి విధుల్లో చేరుతున్నట్లు వెల్లడించారు. దీంతో 42రోజుల సుదీర్ఘ విరామం తర్వాత అంగన్వాడీలు విధుల్లో చేరారు. దీంతో కేంద్రాలు తెరుచుకున్నాయి. ఈసందర్భంగా అరకులోయలో గిరిజన సాంప్రదాయ నృత్యాలు చేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, ఐసిడిఎస్ కార్యాలయానికి వెళ్లి జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అంగన్వాడీల పోరాటం చారిత్రాత్మక మైనదని, స్ఫూర్తిదాయకమన్నారు. అంగన్వాడీల సమ్మెను విజయవంతం చేయడానికి మద్దతిచ్చిన వివిధ ప్రజా సంఘాలు,కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అంగన్వాడి యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

చింతపల్లి: అంగన్వాడీల సమ్మెజయప్రదంతో స్థానిక ఆర్అండ్‌బి ఆవరణలో సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులతో కలసి అంగన్వాడీలు సంబరాలు జరుపుకున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు సాగిన చిరంజీవి పడాల్, అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి పాంగి పెంటమ్మ, లక్ష్మి, చెల్లయమ్మ, నీలమ్మ, రత్నం, వరలక్ష్మి, పాల్గొన్నారు.

పాడేరు : 42 రోజుల సుదీర్ఘసమ్మెతో ప్రభుత్వం దిగొచ్చి 11 డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించి, విధుల్లో చేరుతున్నట్లు అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి జిల్లా కార్యదర్శి కె భాగ్యలక్ష్మి వెల్లడించారు. తమ సమ్మెకు మద్దతుగా నిలిచిన సిఐటియు రాష్ట్ర జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, వర్కర్లు హెల్పర్స్ ఐటిడిఏ ముందు నిరవధిక సమ్మె శిబిరం నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి జాయినింగ్ లెటర్‌ను అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్.సుందర్ రావు, యూనియన్ నాయకులు చిన్నారి, అంబిక, విజయలక్ష్మి,కుమారి, ఇంద్ర, సత్యవతి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలత వ్యక్తంచేయడంతో సమ్మె విరమించిన అంగన్వాడీలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో సమ్మె శిబిరంలో అంగన్వాడి సంఘం నాయకులు,సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజుకేకును కట్ చేసి అంగన్వాడి కార్మికులకు పంచిపెట్టారు. గిరిజన సంప్రదాయమైన నృత్యాన్ని ప్రదర్శిస్తూ విజయోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్మికుల సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండమ్మ కే సత్యవతి జి పవిత్ర ,అంగన్వాడి కార్మికులు, హెల్పర్లు పాల్గొన్నారు.

పెదబయలు : అంగన్వాడీల సమ్మెవిజయంతో ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పెదబయలు మండల కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. విజయోత్సవ సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్, యూనియన్(సిఐటియు)జిల్లా నాయకులు టి రాజమ్మ, మంగమ్మ భవాని కొండమ్మ రూప, పద్మ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిని ధర్మాన్నపడాల్, నాయకులు, సునీల్ కుమార్ సర్పన్న బొండా గంగాధరం పాల్గొన్నారు.

అనంతగిరి :సమ్మె విజయంతో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం నుండి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, సిడిపిఒ. సంతోషి కుమారిని కలిసి జాయినింగ్ రిపోర్టులు ఇచ్చారు. అంగన్వాడీలు గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు మాట్లాడుతూ 42 రోజులపాటు పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించిన అంగన్వాడీలకు విప్లవ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కిల్లో. మోస్య సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు అంగన్వాడి యూనియన్ అధ్యక్షులు పి. మంజుల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. కళావతి, కొర్రా లక్ష్మీ, కమిడి లక్ష్మీ, సాగర సుమిత్ర, కన్యాకుమారి, చిలకమ్మ శాంతి, అరుణకుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు మంగళవారం మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, నాయకులు బీరబోయిన దిలీప్, అంగన్వాడీ యూనియన్ నాయకులు సూక రత్నం, వెంకటరమణ, కామేశ్వరి, కనకదుర్గ, స్వరూప, సత్యవతి, చిట్టెమ్మ, విజయకుమారి, చుక్కమ్మ పాల్గొన్నారు.

కూనవరం : మండల కేంద్రంలో అంగన్వాడీలు మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ తమ సమ్మెకు మద్దతుగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.

విఆర్.పురం : 43 రోజుల నిరవధిక సమ్మె ద్వారా పలు డిమాండ్లు సాధించుకున్న అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు మంగళవారం మండల కేంద్రం రేకపల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వం అరెస్టులు చేసినా, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టినా భయభ్రాంతులకు గురిచేసినా, ఎస్మా చట్టం ప్రయోగించినా, చివరికి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించినా ఎక్కడా వెనుకడుగు వేయకుండా పట్టుదలతో ఐక్యంగా పోరాడిన ఫలితంగానే ప్రభుత్వం దిగొచ్చిందని చెప్పారు. ఇదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, నాగమణి, ముసురు రాజేశ్వరి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పంకు సత్తిబాబు, గుండెపూడి లక్ష్మణరావు, నాలారపు ప్రకాష్‌రావు, కమ్మసిచ్చు సత్యనారాయణ, తాతబాబురెడ్డి, సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : సమ్మె విజయవంతం కావడంతో అంగన్వాడీలు రాజవొమ్మంగిలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలిత అంగన్వాడీలు విధుల్లో చేరుతూ స్థానిక సిడిపిఓ కార్యాలయంలో లెటర్లు అందజేశారు. అనంతరం స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ అంగన్వాడీలు లయబద్ధ నృత్యాలు చేశారు. స్థానికులు కూడా ఇందులో పాల్గొని పోరాడి సాధించారంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కె జగన్నాథం, కె సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు టి శ్రీను, యూనియన్ నాయకులు కె.వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, ఎల్ సత్యవతి, రాజేశ్వరి, భవాని, రాధ, వీరలక్ష్మి, చిన్నమ్మలు, మంగ, రమణి, సుందరమ్మ పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీలేరు : అంగన్వాడీ వర్కర్ల డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చడంతో జీకే వీధి మండలంలో అంగన్వాడీలు విజయోత్సవ సభను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు బోనంగి చెన్నయ్య పడాల్, సిపిఎం మండల కార్యదర్శి అంపరంగి బుజ్జిబాబు, గిరిజన సంఘ నాయకులు చంటి బాబు బాలయ్య, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొయ్యూరు : సమ్మె విరమించిన అంగన్వాడీలు మంగళవారం సిడిపిఒ కార్యాలయానికి వెళ్లి విధుల్లో చేరుతున్నట్లు విడివిడిగా లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్ సూరిబాబు, సిఐటియు నాయకుడు వై అప్పలనాయుడు మాట్లాడుతూ పోరాటాలతోనే సమస్యలు సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు అచ్చియమ్మ ముత్యాలమ్మలతోపాటు అంగన్వాడీలు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో విజయ సంకేతం చూపుతున్న అంగన్వాడీలు



అనంతగిరిలో విజయోత్సవ సభలో మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు



విఆర్.పురంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్



డుంబ్రిగుడలో విజయ సంకేతం చూపుతున్న అంగన్వాడీలు

75 శాతం రాయితీపై మిరియాల యంత్రాలు

- 31లోగా దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు

కేంద్ర ప్రభుత్వం స్పైసెస్ బోర్డ్ సహకారంతో గిరిజన రైతులకు మిరియాలు వలచి, శుభ్రపరిచే యంత్రాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్పైసెస్ బోర్డ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మిరియాలు వలచడానికి, ఎండబెట్టిన తర్వాత శుభ్రం చేయడానికి ఉపయోగపడే యంత్రాలు 75శాతం రాయితీపై గిరిజన రైతులకు అందిస్తామన్నారు. విద్యుత్తు, డీజిల్, పెట్రోల్‌తో ఈ యంత్ర పరికరాలు వినియోగించుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన గిరిజన రైతులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు కుల ధ్రువీకరణ పత్రము, ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జతపరిచి ఐటిడిఏ కార్యాలయంలో ఉన్న స్పైసెస్ బోర్డ్ ఆఫీసులో గానీ, కలక్టర్ కార్యాలయంలో గానీ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఆసక్తి కలిగిన గిరిజన రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మిరియాల నాణ్యత పెంచేందుకు మిరియాలను బ్లాంచింగ్ చేయాలని, తద్వారా నాణ్యతతో పాటు రంగు పెరుగుతుందని కలెక్టర్ వివరించారు. పూర్తి వివరాలకు 9381045818 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్రాధికారి బొడ్డు కల్యాణి పాల్గొన్నారు.

కిల్కారీపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం కిల్కారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిని అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఓ ప్రకాశం ప్రారంభించారు. ఈ శిక్షణను ఆశ కార్యకర్తలకు, ఎమ్మెల్‌హెచ్‌పిఎస్, ఆశ నోడల్ ఆఫీసర్లకు నిర్వహించారు. శిక్షణలో భాగంగా గర్భిణి స్త్రీలు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులకు సంబంచిన సేవలు గురించి తెలియజేశారు. ఆశ కార్యకర్తలకు లబ్దిదారులకు ఫోన్ కాల్స్ ద్వారా సేవలను గుర్తు చేస్తూ లబ్ది పొందే విధంగా సేవలు అందించడం జరుగతుందని స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ మోహన్ వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గంగవరం, పిడతమామిడి, చవిటి దిబ్బలు, ఎల్లవరం రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌ఈఎల్ పరిధిలో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎంహెచ్‌ఒ ప్రకాశం

తాగునీరు, రహదారి కల్పనకు కృషి

- జెడ్‌పిటిసి దీసరి గంగరాజు
- పలు గ్రామాల్లో సిపిఎం బృందం సందర్శన



ఊటగెడ్డ నుంచి నీరు తెస్తున్న గిరిజనులతో కలిసి వస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి

గిరిజన గ్రామాలలో తాగునీరు, రహదారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు అన్నారు మంగళవారం మండలంలోని పెదబిడ్డ పంచాయతీ దివిటీరాయి బందవలస, గొపులవలస గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది గ్రామస్తులతో మాట్లాడి, అయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్డు సమస్య ఉందని స్థానికులు సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు ం డి.బందవలస, గొపులవలస గ్రామాల ప్రజలతో కలిసి మంచినీరు సేకరిచే ఊటగెడ్డ వద్దకు వెళ్లి పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి దూరాన ఉన్న ఊటగెడ్డలు, నీటి కుంటల నుంచి కలుషిత నీరు తెచ్చి తాగునీటి అవసరాలను తీర్చుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. దీనిపై జెడ్‌పిటిసి గంగరాజు స్పందిస్తూ, ఆయాగ్రామాల్లో నీటి ఎద్దడిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతోపాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అలాగే ధన్నుకోట నుండి డి.బందవలస వరకు రోడ్డు సమస్య పరిష్కారానికి సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిపిఎం టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, పార్టీ మండల కార్యదర్శి సోమెల నాగులు, నాయకులు వంతల.బుద్రయ్య, కోనేపు.చిన్నరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్, గ్రామస్తులు పట్టం రామన్న, పి.జగ్గారావు, పి.సంషోన్, సోమన్న, జన్ని.అప్పారావు, సోమెల సోమన్న, జన్ని కొండలమ్మచ పి.సుమిత్ర మహిళలు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఒపిఎస్ సాధనకు పోరాటం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్

ప్రజాశక్తి-చింతూరు

పాత పెన్షన్ విధానం సాధనకు కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని యుటిఎఫ్ భవనంలో యుటిఎఫ్ నాలుగు మండలాల జిల్లా ప్రాంతీయ కార్యవర్గ సమావేశం సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ తరువాత ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన వారందరికి పాత పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలులోకి వచ్చిందని, దీనిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నారని గుర్తు చేశారు. 2019 ఎన్నికల ముందు ఉపాధ్యాయులు, ఉద్యోగులు చేసిన పోరాటాల ఫలితంగా ఆ నాడు పాదయాత్ర చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని వాగ్ధానం చేశారని, అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాల తరువాత పాత పెన్షన్ సాధ్యం కాదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల ప్రధాన, బాధ్యులు పాల్గొన్నారు.

గుమ్మిరేవులు బస్సు పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు

ఆర్టీసీ అధికారులు నర్సీపట్నం - గుమ్మిరేవులు బస్సును పునరుద్ధరించారు. ఈ బస్ సర్వీసును అర్ధాంతరంగా రద్దు చేయడంతో 18 గ్రామాల గిరిజనులతో పాటు, ఉద్యోగులు రవాణా సౌకర్యానికి ఇబ్బందిగా మారిందని ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి యథాతథంగా నర్సీపట్నం- గుమ్మిరేవులు బస్ సర్వీసును పునరుద్ధరించారు. దీంతో దారకొండ గుమ్మిరేవుల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఇకనుంచి బస్ సర్వీసుని యధాతధంగా కొనసాగించాలని ఎప్పుడు రద్దు చేయరాదని గిరిజనులు కోరుతున్నారు. బస్ సర్వీసు పునుద్ధరించడానికి కృషి చేసిన పోలీస్ శాఖకు, ఆర్టీసీ అధికారులు స్పందించిన తీరును గిరిజనులు కృతజ్ఞతులు తెలిపారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ప్రధాన కూడలిలో మంగళవారం ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే తమకు సర్వీసు లేక తమ కుటుంబాలు రోడ్డు మీద పడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బలిమెల రిజర్వాయర్ నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర -ఒరిస్సా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలు, వినియోగంపై ఆంధ్ర ఒరిస్సా అధికారులు మంగళవారం జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2020- 24 సంవత్సరంలో ఇప్పటివరకు నీటిని ఎంతెంత వినియోగించుకున్నారో లెక్కలు కట్టారు. 2023 డిసెంబర్ 31 నాటికి 2022-23 సంవత్సరంలో ఏపీ అదనంగా వినియోగించుకున్న 13.7578 టీఎంసీలు నీటితో కలిపి 38.8517 వీటిని వినియోగించుకున్నట్లు తేల్చారు. ఒడిస్సా 2023 డిసెంబర్ 31 నాటికి 35.7780 టిఎంసీలు నీటిని వినియోగించినట్లు లెక్కలు కట్టారు. ప్రస్తుతం బలిమెల జోలాపూట్ జలాశయంలో 54.1196 నీటి నిల్వలు ఉన్నట్లు ఇరు రాష్ట్ర అధికారులు లెక్కలు కట్టారు. ఈ నీటి నిల్వలో ఆంధ్ర వాటగా 25.5230 టీఎంసీలు కాగా, ఒరిస్సా వాటగా 28.5966 టీఎంసీలుగా పంపకాలు చేశారు. ప్రస్తుతం విద్యుత్తు, వ్యవసాయం మంచినీటి అవసరాల నిమిత్తం ఆంధ్ర 3000 వేల క్యూసెక్కుల నీటిని ఒడిస్సా 1500 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సమావేశంలో ఒరిస్సా తరపున పొట్టేరు చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ పిటాబాస్ సంగతి, ఎస్ఈ రమాకాంత పాత్రో, ఒరిస్సా హైడ్రో పవర్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దుర్గేశ్ మోహర్, మేనేజర్ విజయ్ కుమార్ శెట్టి, ఆంధ్ర తరపున ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్, ఏడిఈ క్యాంపు వెంకటమధు, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు


మరమ్మతులు చేస్తున్న ఎస్‌బిసి సంస్థ ప్రతినిధులు

పాడైన బోర్లకు మరమ్మతులు


గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని మారుమూల గ్రామాల్లో మంచినీటి బోర్లను కాకినాడకు చెందిన సైలెమ్ బ్లైండ్ సెంటర్ (ఎస్‌బిసి) సేవా సంస్థ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడుతున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్.ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే చేయూత కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో గుర్తించిన 70 బోర్లు మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పోసలగరువు, గున్న మామిడి బంగారు మెట్ట, ఉప్ప, మత్య పురం తదితర గ్రామాలలో బోర్లు మరమ్మతులు చేశామన్నారు. 2018 లో తమ సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు గుర్తించి బోర్లు లేని గ్రామాలను గుర్తించి అప్పట్లోనే 120 బోర్లను సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. హుకుంపేట మండలంలో 70 బోర్లను ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సౌకర్యం లేని గ్రామాలను గుర్తించి, 2024లో నూతనంగా మరో 200 బోర్లును తమ సంస్థ ఆధ్వర్యంలో వేయనున్నట్లు వెల్లడించారు. అలాగే గిరిజన గ్రామాల్లో బోర్లు పాడైనప్పుడు వాటికి మరమ్మతులు చేసేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో బోరు మెకానిక్‌తో మరమ్మతులు చేయిస్తున్నట్లు వెల్లడించారు.

బోరు వేశారు .. నీరెప్పుడిస్తారో..?

మొండిబోరు వద్ద ఖాళీ బిందెలతో గిరి మహిళల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి : గిరి పల్లెలకు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలనే ఉద్దేశ్యంతో జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించినా అవి పూర్తి చేయకపోవడంతో తాగునీరు ఇవ్వని పరిస్థితి నెలకొందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని నాన్ షెడ్యూల్ పంచాయతీ కొండ శిఖరు గ్రామాలైన భూరిగా, చిన్నకోనెల గ్రామాల్లో వార్డు మెంబర్ సోమ్మెల. అప్పలరాజు, జన్ని పోలమ్మ ఆధ్వర్యంలో మొండిబోర్లు వద్ద ఖాళీ బిందెలతో గిరిజన మహిళలు వినూత్న నిరసన చేపట్టారు. నెత్తిన పెట్టి చేతులు జోడించి కలెక్టర్, పిఒలు వెంటనే స్పందించి, తాగునీటి సౌకర్యంక ల్పించాలని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు, పోలమ్మ మాట్లాడుతూ, మండలంలోని నాన్ షెడ్యూల్ పంచాయతీకొండ శిఖరు గ్రామాలైన భూరిగా, చిన్నకోనెల గ్రామాలలోని 70 కుటుంబాలకు చెందిన 250 మంది గిరిజనులకు జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పనకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినా, అవి పూర్తి చేయలేదన్నారు. కేవలం బోరు మాత్రమే తవ్వి, పైపులైను, కుళాయిలు, విద్యుత్ కనెక్షన్, మోటారు బిగించి తాగునీరు ఇచ్చే చర్యలు చేపట్టకపోవడంతో తామంతా గ్రామానికి దూరాన ఉన్న ఊటగెడ్డల్లోని నీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బోరు పాయింట్ వేసి ఆరునెలలైనా మిగతా పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం


మొండి బోరు వద్ద ఖాళీ బిందెలు నెత్తిన పెట్టి నిరసన తెలుపుతున్న మహిళలు

చేస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిచి కుళాయిలను ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా అలసత్వం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికైనా స్పందించి తక్షణమే మిగతా పనులు పూర్తి చేయాలని, లేకుంటే మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శెట్టి గంగాధర్ స్వామి

సొంత గూటికి గంగాధరస్వామి

షర్మిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న నేత

ప్రజాశక్తి-అరకులోయ: అరకు నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి మళ్లీ సొంతగూటికి చేరారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అరకులోయ ఎస్.కోట నియోజకవర్గంలో ఇమిడి ఉన్నప్పుడు రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమిపాలైన అనంతగిరి మాజీ ఎంపీపీ శెట్టి గంగాధర స్వామి అరకు నియోజకవర్గ ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడి భంగపడి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన శెట్టి గంగాధర్ స్వామి 20వేల ఓట్లు పైబలుకు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీకి గడ్డుకాలం ఏర్పడడంతో వైసిపిలో చేరి, ఆ పార్టీ బలోపేతానికి తీవ్రంగా కృషి చేసినప్పటికీ, అనంతరం జరిగిన ఎన్నికల్లో టికెట్ ఆశించిన దక్కకపోవడంతో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. దీంతో శెట్టి గంగాధర్ స్వామి అధిష్ఠానం తర్వాత కాంగ్రెస్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టి, దానికే పరిమితం చేసింది. వైసిపిలోకి తన తర్వాత వచ్చిన వారికి సముచిత స్థానం కల్పించినప్పటికీ, తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన గంగాధర స్వామి, వైయస్ షర్మిలను పిసిసి పగ్గాలు అప్పగించడంతో మళ్లీ మాతృపార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి చేరినట్లు శెట్టి గంగాధర్ స్వామి విలేకరులకు తెలిపారు. వైసిపిలో ఎస్టీ కమిషన్ వైస్ చైర్మన్, జిసిసి చైర్మన్ పదవులు ఇస్తామని హామీలు ఇచ్చినా, వేరే వ్యక్తులకు ఆ పదవులను కట్టబెట్టడంతో పార్టీని వీడినట్లు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డితో ఉన్న అనుబంధం, అభిమానంతో మరల కాంగ్రెస్ పార్టీలో చేరిన తాను అరకు నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాక బాబురావు పాల్గొన్నారు.


ఇవిఎం ద్వారా ఓటు వేయడంపై అవగాహన కల్పిస్తున్న డిటి, సర్పంచ్

ఓటు వేయడంపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లు (ఇవిఎం)లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. మంగళవారం మఠం పంచాయతీ సర్పంచ్ శాంత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్ కృష్ణారావు పాల్గొని, ఇవిఎంలతో ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం పలుదఫాలుగా ఓటర్ల నమోదు, సవరణకు అవకాశం ఇచ్చి, పిర్యాదు, అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాత ఓటర్ల తుదిజాబితాలను సోమవారం వెల్లడించిందన్నారు. ఈ నేపథ్యంలో ఇవిఎంలలో ఓటు వేసే విధానంగా ఓటర్లకు అవగాహన కల్పించాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలతో నమూనా ఇవిఎంలతో ఓటు వేసే విధానంపై వివరించామన్నారు. జాబితాలో పేర్లున్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

సర్పంచ్ శాంత కుమారి మాట్లాడుతూ ప్రజలు, యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఇంకా ఎవరికైనా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాంగి మత్స్య కొండ బాబు, మఠం సింహ చలం నాయుడు, గెమ్మెలి అప్పారావు, మఠం పంచాయతీ విఆర్‌ఓ సూర్య ప్రకాష్ రెడ్డి, గూడా విఆర్‌ఒ కే చందు, విఆర్‌ఎ సంపత్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్ కుమార్, సచివాలయం సిబ్బంది మోహిని పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

డ్వాక్రా సంఘాల ఖాతాలకు రూ.34.06 కోట్లు జమ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి


ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు : మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేసారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నుండి నాలుగవ విడత ఆసరా నిధులను డ్వాక్రా సంఘాల ఖాతాలకు సీఎం జగన్ జమ చేసే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం కలెక్టరేట్ నుండి స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 85167 మంది సభ్యులున్న 8664 స్వయం సహాయక సంఘాల పొదుపు ఖాతాలకు రూ.34.06 కోట్లు ఆసరా నగదును ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెడ్డి జమ చేసారన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఆసరా ను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అరకు నియోజక వర్గం పరిధిలో 2295 స్వయం సహాయక సంఘాలకు రూ.7. 67 కోట్లు, పాడేరు నియోజక వర్గంలో స్వయం సహాయక 1521 సంఘాలకు రూ. 6. 25 కోట్లు, రంప చోడవరం నియోజక వర్గంలో 4848 స్వయం సహాయ సంఘాలకు రూ. 20.14 కోట్లు నగదు జమ చేసినట్లు వెల్లడించారు.

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేద మహిళల ఆర్థిక పురోగతికి వైఎస్ఆర్. ఆసరా దోహద పడుతుందన్నారు. ఆసరాను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. అసరా పథకం నమూనా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేసారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వి.మురళి,వెలుగు సిబ్బంది, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయమే ధ్యేయం

ప్రజాశక్తి -యస్ రాయవరం : రానున్న ఎన్నికల్లో విజయం సాధించి, రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చడమే టిడిపి జనసేన పార్టీల ఉమ్మడి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మండలంలోని రేవుపోలవరం గ్రామంలో నిర్వహించిన అనితమ్మ పల్లె పిలుపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమెకు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకగా, మహిళలు హారతి ఇచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అన్నివర్గాల వారిని అణగదొక్కుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి మరో మూడు నెలల్లో కాలం చెల్లిపోతుందని, టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్దం, పార్టీ సీనియర్ నాయకులు వెంకటరాజు,కోడ లోవరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -పాడేరు : స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న 75వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మంగళవారం పరిశీలించారు. తలారిసింగ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిపబ్లిక్ డే ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేసారు. వేదిక, స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్‌ఎం రాజు, డిడి .ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని, హెచ్‌ఎం ఆర్. జాన్ పాల్గొన్నారు.

26 అడ్డాకుల తయారీ కేంద్రం ప్రారంభం

స్థానిక సాల్ట్ ఫ్యాక్టరీ భవనంలో ఏర్పాటు చేస్తున్న అడ్డాకుల తయారీ కేంద్రాన్ని ఈనెల 26న ప్రారంభిస్తున్నామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ తెలిపారు. మంగళవారం విడివికె ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అడ్డాకుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. యంత్ర పరికరాలు ఏర్పాట్లును వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అడ్డాకులతో ప్లేట్లు, గ్లాసులు, సాసర్లు తయారు చేయాలని సూచించారు. కార్య క్రమంలో వెలుగు ఎపిడి వి. మురళి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

గ్రూపు-2 స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని గిరిజన యువత బాగా చదివి గ్రూప్-2లో ఉత్తీర్ణత సాధించాలని ఎంపీపీ బడుగు రమేష్, తహశీల్దారు తిరుమలరావు, డిప్యూటీ తహశీల్దారు (రీసర్వే) దుమంతి సత్యనారాయణ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని బాలుర హాస్టల్-2లో మంగళవారం 35 మంది గిరిజన యువతీ యువకులకు గ్రూప్-2 స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుమంతి సత్యనారాయణ మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి గుడిసె బాలకృష్ణ తండ్రి గుడిసె కృష్ణారావు జ్ఞాపకార్థం ఈ స్టడీ మెటీరియల్ బాలకృష్ణ ఆర్థిక సహాయంతో అందించినట్లు చెప్పారు. గ్రూప్-2 ప్రిలిమినరీలో ఉత్తీర్ణులైన వారికి మెయిన్స్‌లో కోచింగ్‌కు పంపుతానని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంప ఎస్సై లోకేష్ కుమార్, ఏఎస్‌ఓ చైతన్య, బాయ్స్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ దుమంతు వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిజెపి రాజకీయ లబ్ధి కోసమే అయోధ్య వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అయోధ్యను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సబబు కాదని కాంగ్రెస్ కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికం, ధరల పెంపు, నిరుద్యోగం వంటి సమస్యలు విలయ తాండవం చేస్తున్న నేపథ్యంలో బిజెపి అయోధ్యను ఉపయోగించుకుని రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, బ్లాక్ మనీ నుంచి ప్రతి కుటుంబానికీ రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రను ప్రభుత్వం అసోంలో అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలపై దమనకాండ అమానుషమన్నారు. ఎపి రాజకీయాల్లో ఒక్కసారిగా పెను మార్పులు వచ్చాయన్నారు. పేద ప్రజల్లో పరివర్తన కనిపిస్తోందని తెలిపారు. ప్రజలకు నవరత్నాలు కూడు, గూడు ఇవ్వడం లేదన్నారు. ఎపిలో అభివృద్ధి ఆగిపోయిందని తెలిపారు. పదేళ్ళలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పక్కా ఇళ్లను ఇవ్వలేదన్నారు. బిటెక్ చదివిన యువకులు మద్యం దుకాణాల్లో పని చేస్తున్నారని ఆవేదన వెలుబుచ్చారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఎపిలో అంటరానితనం ఇంకా మాసిపోలేదని తెలిపారు. క్రైస్తవుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. షర్మిల మీద సోషల్ మీడియాలో అవాస్తవాల పట్ల అసహనం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎపిలో 130 అసెంబ్లీ స్థానాలు, 20 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. షర్మిల రాకతో కాంగ్రెస్ బలం పెరిగిందన్నారు. ప్రత్యేక హోదా ఫైలు మీద తొలి సంతకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలతో కాంగ్రెస్ మేనిఫెస్టో వుంటుందని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, న్యాయవాది గారా సూర్యారావు పాల్గొన్నారు.

ఉక్కును ప్రైవేటీకరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని కుట్రలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1076వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఎస్‌ఎంఎస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు విడివి.పూర్ణచంద్రరావు మాట్లాడారు. మోడీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ఊసే లేకుండా పోయిందన్నారు. ఉన్న వాటిని కూడా ప్రైవేటుకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

హుకుంపేట: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. హుకుంపేటలో కేకు కట్‌చేసి, మిఠాయిలు పంచిపెట్టారు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తులసి రావు, సంతారి కోఆపరేటివ్ మాజీ డైరెక్టర్‌లు నూకరాజు, కర్రి బాబు, టిడిపి సీనియర్ నేతలు సంతోష్, శ్యాము, మాజీ సర్పంచ్ వాసుదేవుడు, సుబ్బారావు, వెంకట్ నాగేష్, నూకరాజు, నాగరాజు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: స్థానిక. మోదకొండమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కేక్ కట్ చేసి యువనేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అరాచకాలను, అక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ యువనేత లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రజలకు మరింత చేరువయ్యారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గబ్బాడ సింహాచలం, కొట్టగుల్లి రమేష్ నాయుడు, గంగపూజారి శివకుమార్, డప్పోడి వెంకటరమణ, పాడేరు, జిమాడుగుల మండల అధ్యక్షులు రామనాయుడు, కొండలరావు, సుమన్, అశ్విన్ కుమార్, రామ్ నాయుడు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు కొట్టగుల్లి సుబ్బారావు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు మన్యం ప్రజల తరపున టిడిపి నేత కిల్లు రమేష్‌నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు లోకేష్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ఎన్‌టిఆర్ విగ్రహానికి, లోకేష్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కేక్ కట్ చేసి లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు అడపా నరసింహమూర్తి, సాగెని బొంజు పడాల్, ఉల్లి రామారావు, మాజీ సర్పంచ్ లు సీదరి తౌడయ్య, ముడువ వెంకటేశ్వర్లు, మజ్జి భీమేష్, బాకూరు బాలరాజు, శోబా శ్రీనివాస్, కిల్లో బొంజుబాబు, ఉల్లి సతీష్ కుమార్, సింహాద్రి, సన్యాసి పాల్గొన్నారు.

చింతపల్లి: లోకేష్ జన్మదిన వేడుకలను పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు టెంట్ హౌస్ వద్ద పార్టీ సీనియర్ నాయకుడు పెదిరెడ్ల బేతాళుడు, అరకు పార్లమెంటు బిసి సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణంలతో కలిసి కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గొల్లూరి మంగు, మొట్టడం వెంకటరమణ, బేతా నాగు, మర్రి మంగ్లు, వంతల గణపతి, చిందాడ చిన్న, గోవింద్, అనిల్, పాల్గొన్నారు.

పాడేరు: మండలంలోని గుడివాడ గ్రామంలో పాడేరు నియోజకవర్గ టిడిపి నేత కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలను శాలువాలతో సత్కరించారు. దుప్పట్లు పంపిణీ చేశారు. అనాథ ఆశ్రమం నవజీవన్ 80 మంది పిల్లలతో రాత్రి సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మణికుమారి, రాష్ట్ర కార్యదర్శి బుర్ర నాగరాజు, జెడ్పీ మాజీ చైర్మన్ కాంతమ్మ పాడేరు సర్పంచ్ ఉషారాణి, మాజీ ఎంపీపీ ముత్యాలమ్మ పిన్నయ్య దొర మాజీ సర్పంచ్, బీసీ సెల్ కార్యదర్శి పూసర్ల గోపి , బీసీ సెల్ ప్రెసిడెంట్ పాడేరు ప్రశాంత్ , గ్రామ పెద్దలు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కూనవరం : తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ హాస్పిటల్‌లో మాజీ ఎంపీ సోడే రామయ్య ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బరపాటి ప్రకాష్, గడేసుల రంజిత్ కుమార్, గడ్డిపాటి ప్రసాద్, ఎండీ షరీఫ్, నోముల సత్యనారాయణ, భీష్మాచారీ, కట్టం సునీత, తెల్లం సురేశ్, గిగా రామారావు, ముచ్చిక వీరాస్వామి, జోడే ముత్తయ్య, మడకం వీరబాబు, శీలం వెంకటేష్, కణితి నరసింహారావు, కోవాసి సత్యం, వేర్పుల సురేశ్, పొట్టి చిన్నబాబు పాల్గొన్నారు.

రంపచోడవరం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత ఆధ్వర్యాన రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో గర్భిణులు, రోగులకు సుమారు 250 మందికి రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, అనంత మోహన్, అడబాల బాపిరాజు, సిద్ధ వెంకన్న దొర, బొడ్డేటి వీరబాబు, చక్రవర్తి, సాదల సత్యవతి, సంకురు పెంటమ్మ, పండా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నోలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దూరవిద్యా విధానంలో నాలుగేళ్ళ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టిందని వర్సిటీ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీ డిసిప్లినరీ విధానంలో 19 రకాల డిగ్రీ కోర్సులను ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాల్లో ఇగ్నో అందిస్తోందని, ఇటీవలే యుజిసి ఛైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్ ఈ నాలుగేళ్ళ దూరవిద్యా కోర్సులను ప్రారంభించారని తెలిపారు. ఈ మల్టీ డిసిప్లినరీ కోర్సులు డిగ్రీ చదివిన తరువాత ఉపాధి కోరుకునేవారికి, దేశ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి, పరిశోధన రంగంలోకి వెళ్లాలనుకునే వారికి అనుకూలంగా ఉంటాయని వెల్లడించారు. జనవరి 2024లో ప్రవేశాలకు ఈ నాలుగేళ్ల కోర్సులతో పాటు పలు ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కొత్త కోర్సుల్లో చేరేవారు మల్టీ డిసిప్లినరీ విధానంలో సైకాలజీ వంటి సబ్జెక్టులను ఎంచుకోవచ్చునని తెలిపారు. స్వయం పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో కూడా ఈ నాలుగేళ్ల కోర్సులను చేయవచ్చునన్నారు. జనవరి సెషన్ అడ్మిషన్స్ ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. తమ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయని తెలిపారు.


రోడ్డు మరమ్మతులు చేపడుతున్న స్థానికులు

సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండల కేంద్రంలోని సినిమా హాలు వెనుక వీధిలో స్థానికులు తమ సొంత డబ్బులతో రోడ్డు బాగు చేసుకున్నారు. వర్షాలకు, వరదలకు ఈ ప్రాంతంలో రోడ్డు కొట్టుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. దశాబ్ద కాలాల నుండి రోడ్డు వేయమని స్థానికులు అధికారులకు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. గత ఎన్నికల ముందు ఓట్లు అడిగేందుకు వచ్చిన నాయకులకు తమ రోడ్డు పరిస్థితి చెప్పి రోడ్డు వేయాలని, గోతుల్లో నడవలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం వస్తే రోడ్డు పనులు వెంటనే చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు మళ్లీ బాధితుల ముఖమే చూడలేదు. రహదారి సరిగా లేక ఇబ్బంది పడుతున్న స్థానికులు సొంత డబ్బులు రూ.2000 ఖర్చు చేసి వ్యర్థ ఇటుకలు, సిమెంట్ ముక్కలు తెచ్చి రోడ్డుపై పరిచి నడిచేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఏరు దాటే వరకు ఏరు మల్లన్న, ఏరు దాటాకా బోడి మల్లన్న అన్న చందంగా అధికార పార్టీ నాయకుల తీరు ఉందని మండి పడ్డారు. ఈసారి నాయకులు వచ్చి ఏ విధంగా ఓట్లు అడుగుతారని, ఏ మొఖం పెట్టుకొని వస్తారు ప్రశ్నిస్తున్నారు. కనీసం రోడ్డు మరమ్మతులైన చేయాలని చెప్పినా కనికరం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు ఎవరు పట్టించుకోలేదని, ఈసారి ఎన్నికల్లో ఎవరు వచ్చి ఓట్లు అడిగినా వారికి సమాధానం గట్టిగానే చెబుతామని అంటున్నారు.

బివిసిపి మండల కార్యదర్శిగా విశ్వనాథం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శిగా దుమంత విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మారేడుమిల్లిలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో మండల నూతన కమిటీ, కార్యదర్శి ఎన్నిక జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర నాయకులు జుత్తుక కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజన ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ ప్రాంతంలో గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. చట్ట విరుద్ధమైన అక్రమ కట్టడాలకు మాత్రం అధికారులు వెన్నుదన్నుగా నిలబడ్డారని, విచ్చలవిడిగా మండల కేంద్రంలో అక్రమ కట్టడాలు గిరిజనేతరులు కడుతున్న ప్రభుత్వ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమ కట్టాలపై అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున గిరిజనుల తరపున పోరాడుతామని కుమార్ హెచ్చరించారు.

రాజన్న ఆటోనగర్ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజన్న ఆటోనగర్ స్థలాన్ని వైసిపి ప్రభుత్వం కాజేయాలని కుట్ర చేస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు అన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో సుమారు 10 వేల మంది ఆటో పార్ట్స్, స్క్రాప్ డీలర్స్ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కణమాం గ్రామంలో రాజన్న ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని చెప్పిందని, 157 ఎకరాలకు పైగా అందుకోసం సేకరించారని తెలిపారు. అందులో పది ఎకరాలకు సంబంధించిన భూములకు ప్రభుత్వం నేటి వరకు పరిహారం చెల్లించనందున ఆ భూముల రైతులు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ పలుమార్లు రాజన్న ఆటో నగర్ నిర్మాణానికి స్థలాన్ని ప్లాట్లుగా విభజించడం జరిగిందని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ మాటలు నమ్మి తాము అక్కడికి వెళ్లి చూశామని, అయితే ప్లాట్ల విభజన జరగలేదని, సేకరించిన భూమిలో ఎటువంటి మార్పులూ లేవని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా రాజన్న ఆటోనగర్‌కు శంకుస్థాపన చేయాలని కోరారు.